ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 6 జూలై 2025



బీఎల్‌వోలకు శిక్షణ

రామగిరి, జూలై 5(ఆంధ్రజ్యోతి): బీఎల్‌వోలు తమకు అప్పగించిన విధులను బాధ్యతతో నిర్వహించాలని ఆర్డీవో సురేష్ అన్నారు. శనివారం రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణ నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటరు నమోదు చేయాలని, ఊరు విడిచి వెళ్లినా, మరణించిన వారి పేర్లను తొలగించాలని సూచించారు. ప్రతీ బూత్ లెవెల్ అధికారి ఇంటింటికి తిరుగుతూ సర్వే నిర్వహించి వివరాలను సేకరించాలని తెలిపారు. తహసీల్దార్ సుమన్, మండల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ముప్పై రోజుల్లో ఇల్లు ఖాళీ చేయాలి

● కలెక్టర్ ఆదేశం

పెద్దపల్లి కల్చరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల సంరక్షణ చట్ట పరిధిలోని ఓ కేసును విచారించిన కలెక్టర్ ముప్పై రోజుల్లో ఇల్లు ఖాళీ చేయాలని తీర్పు ఇచ్చారు. రామగుండం మండలంలోని ఎఫ్‌సీఐ ప్రాంతానికి చెందిన ఓ వృద్ధురాలిని కొడుకు సరిగా చూసుకోవడం లేదని, భయాందోళనకు గురి చేస్తున్నాడని గతంలో పెద్దపల్లి ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది. ఆయన ఆమె కొడుకును ఇల్లు ఖాళీ చేసి, ఆమెకు ఇవ్వాలని ఆదేశించారు. కానీ కుమారుడు స్పందించకపోవడతో సదరు వృద్ధురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో ఆయన స్పందించి 2007 వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద ఇరువర్గాల వాదనల మేరకు వృద్ధురాలికి అనుకూలంగా తీర్పును వెలువరించారు. తల్లితండ్రులు, వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టం సెక్షన్ 23, 21(3)(బి) నియమం మేరకు వారి భద్రత, శ్రేయస్సు, గౌరవాన్ని పరిగణలోకి తీసుకుని ముప్పై రోజుల్లో కుమారుడు ఇల్లు ఖాళీ చేయాలని తీర్పులో వెలువరించారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అమలు జరిగేలా జిల్లా సంక్షేమ అధికారి, పోలీసు అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత ప్రతీ కొడుకుపై ఉందని, నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధి పనుల్లో పొదుపు మంత్రం

- పనిదినాల్లో కోత విధించిన కేంద్ర ప్రభుత్వం
- జిల్లాకు కేటాయించిన పని దినాలు 13.99 లక్షలు
- పూర్తి చేసినవి 10.14 లక్షలు, మిగిలినవి 3.85 లక్షలు
- ఆ పని దినాలను వనమహోత్సవానికి వాడుకోవాలని నిర్ణయం
- రోజువారీ కూలీ రూ.300లకు పైగా వచ్చేలా చూడాలని ఆదేశాలు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గ్రామీణ ప్రాంత కూలీలకు వరంగా మారిన మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో గతంలో కంటే సగం వరకు పని దినాలను కేంద్ర ప్రభుత్వం తగ్గించడంతో ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పని దినాలను ప్రాధాన్యతా కార్యక్రమాలకు వాడుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పొదుపు మంత్రం పాటిస్తున్నది. జిల్లాకు కేటాయించిన 13.99 లక్షల పని దినాల్లో 10.14 లక్షల పని దినాలు 72.49 శాతం పూర్తి కాగా, ఇంకా 3.85 లక్షల పని దినాలు మిగిలి ఉన్నాయి. మిగిలిన పని దినాలను వన మహోత్సవం కార్యక్రమానికి సద్వినియోగం చేసుకోవడంతో పాటు కూలీల సగటు కూలీ 300 రూపాయలకు పైగా వచ్చే విధంగా వారిని ప్రోత్సహించాలని ఉన్నతాధికారులు జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం సగటు కూలీ 247.47 రూపాయలు వస్తున్నది.

పని దినాలు తక్కువగా కేటాయించడం వల్ల తద్వారా మెటీరియల్ కంపొనెంట్ కింద తక్కువ నిధులు సమకూర నున్నాయి. దీంతో గ్రామాల్లో శాశ్వత నిర్మాణాలకు నిధుల కొరత ఏర్పడే ప్రమాదం నెలకొ న్నది. పని దినాలు తక్కువైనా, దినసరి కూలీ సగటున 300 రూపాయలకు పైగా వచ్చే విధంగా కూలీలు పని చేస్తే మెటీరి యల్ కంపొనెంట్ నిధులు పెరగ నున్నా యని అధికారులు భావిస్తున్నారు. ఉపాధిహామీ చట్టం ప్రకారం కేటాయించిన నిధుల్లో తప్పనిసరిగా 60 శాతం కూలీలకు పనులు కల్పిస్తే, తద్వారా ఖర్చు అయ్యే నిధుల్లో 40 శాతం నిధులను మెటీరియల్ కంపొనెంట్ పనులకు కేటాయిస్తారు. జిల్లాలోని 269 గ్రామ పంచాయతీల పరిధిలో లక్షా 19 వేల జాబ్ కార్డులు జారీ చేయగా, 2 లక్షల 44 వేల మంది కూలీలు నమోదై ఉన్నారు. కానీ రెగ్యులర్‌గా 71 వేల మంది వరకు కూలీలు ఉపాధిహామీ పనులకు వస్తుంటారు.

● **10.14 లక్షల పని దినాలు పూర్తి..**

ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం జిల్లాకు 13.99 లక్షల పని దినాలను కేటాయించింది. ఇప్పటి వరకు 10.14 లక్షల పని దినాలు పూర్తి కాగా, ఇంకా 3.85 పని దినాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ పని దినాలను ప్రభుత్వం జాగ్రత్తగా వాడుకోవాలని భావిస్తున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 25.55 లక్షల పని దినాలు కేటాయిస్తే, ఆ తర్వాత అదనపు పని దినాలను కలుపుకుని 27.07 లక్షల పని దినాలను కూలీలు సద్వినియోగం చేసుకున్నారు. కూలీలకు 58 కోట్ల 68 లక్షల 93 వేల రూపాయలు వేతనాల కింద చెల్లించారు. తద్వారా మెటీరియల్ కంపొనెంట్ కింద 30 కోట్ల 44 లక్షల రూపాయలు కేటాయించారు. ఈ నిధులతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, మురికి కాలువలు, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, ఇతరత్రా పనులు చేపట్టారు. ఈ ఏడాదికి జిల్లాలో చేపట్టిన 10.14 లక్షల పని దినాలను సద్వినియోగం చేసుకున్న కూలీలకు వేతనాల కింద 27 కోట్ల 35 లక్షల 18 వేల రూపాయలు చెల్లించారు. తద్వారా మెటీరియల్ కంపొనెంట్ కింద 16 కోట్ల 72 లక్షల 62 రూపాయలు సమకూరగా, వివిధ పనుల కోసం 3 కోట్ల 83 లక్షల 59 ఖర్చు చేయగా, 12 కోట్ల 89 వేల రూపాయలు జనరేట్ అయి ఉన్నాయి గత ఏడాది ఇదే సమయానికి జిల్లాలో 15

(మిగతా 8వ పేజీలో)

విద్యార్థులు న్యాయవిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి డాక్టర్ శ్రీనివాసరావు

కోల్‌సిటీటౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు న్యాయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ర్యాగింగ్, వరకట్నం, అవినీతి అంటరానితనం లాంటి విషయాల పట్ల విద్యార్థులు అవగాహనతో ఉండాలన్నారు. సమస్యలను న్యాయపరంగా ఏవిధంగా ఎదుర్కొవాలో తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు విద్యలో రాణించి సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి, కళాశాల ప్రిన్సిపల్ డి.కల్పన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.సతీష్, ఎమినెంట్ పర్సన్ ఎన్.కిషన్‌రావు, ఏజీపీ శంతన్‌కుమార్, కోర్ట్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంప్‌డ్ స్టోరేజీ ప్లాంట్ సింగరేణికి కీలకం

డైరెక్టర్(ఈఅండ్‌ఎం) సత్యనారాయణ



మ్యాప్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్(ఈఅండ్‌ఎం) సత్యనారాయణ

గోదావరిఖని, జూలై 5(ఆంధ్రజ్యోతి): రామగుండం మేడిపల్లి ఓసీపీ-4లో ఏర్పాటు చేస్తున్న 500మెగావాట్ల పంప్‌డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంట్ సింగరేణికి కీలకం కానున్నదని డైరెక్టర్(ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావు అన్నారు. శనివారం ఆయన మూతపడిన ఓసీపీ-4ను సందర్శించారు. పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి చేపట్టాల్సిన పనులను అధికారులతో చర్చించారు. ప్రాజెక్టు ఫిజికల్ రిపోర్టు, డీపీఆర్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి వ్యాప్కోస్ సంస్థతో చర్చించారు. ప్రాజెక్టుకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. సింగరేణిలో మొదటి సారిగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 500 మెగావాట్ల పంప్‌డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంట్ రాష్ట్రంలోనే మొదటిదని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే భవిష్యత్‌లో మరిన్ని కొత్త ప్రాజెక్టుల నిర్మాణంలో ఇది కీలక మలుపని డైరెక్టర్ పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా పెరుగుతున్న పోటీ దృష్ట్యా సింగరేణి బొగ్గు ఉత్పత్తినే కాకుండా థర్మల్, సోలార్ విద్యుత్, విండ్ ఎనర్జీతోపాటు మూతపడిన ఓసీపీల్లో పంప్‌డ్ స్టోరేజీ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తికి సిద్ధం కావడం కొత్త అధ్యయనం అన్నారు. కాలానికి అనుగుణంగా సింగరేణి నూతన సాంకేతికతతో దేశంలోనే అత్యుత్తమ సంస్థగా ఏర్పడుతుందని చెప్పారు. డైరెక్టర్‌తో పాటు ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఇన్‌చార్జి ఎస్‌ఓటూ జీఎం ఆంజనేయప్రసాద్, అధికారులు రమేష్, మురళీధర్, విశ్వనాథ్, ప్రభాకర్, శ్రీనివాస్, జితేందర్‌సింగ్, లక్ష్మీరాజం, వసంత్‌కుమార్, వీరారెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా నిల్వలు

పాలకుర్తి, జూలై 5(ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా నిల్వలు మండలంలో అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి పేర్కొన్నారు. శనివారం కన్నాల పీఏసీఎస్ చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డితో కలిసి రైతులకు ఉచిత కంది, జనుము విత్తనాలను పంపిణీ చేశారు. అల్ట్రాటెక్ ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని కలిసి దత్తత గ్రామాలలో సన్నచిన్న కారు రైతులకు, వ్యవసాయ అవసరాలకు, ఆయిల్‌పామ్ సాగుకు సీఎస్ఆర్ నిధుల నుంచి సహకరించాలని కోరారు. అనంతరం పాలకుర్తి రైతువేదికలో జాతీయ ఆహారభద్రత మిషన్ కింద వంద శాతం సబ్సిడీపై విత్తనాలను అభ్యుదయ రైతులకు పంపిణీ చేశారు. ఉద్యానవన శాఖ అధికారి ఏ జ్యోతి, మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు శశిధర్, ఎం యోజన, సుష్మ, ప్లాంటేషన్ అధికారి ప్రశాంత్, డ్రిప్ అధికారి రాజు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతపై

విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు



బాలికల ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం మంథని పట్టణంలో పలు ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన మెరుగైన విద్య అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేసిందన్నారు. ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూంలను సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. రోబోటిక్స్, డ్రైవర్ లెస్ కార్ల వంటి సాంకేతిక అంశాలు విద్యార్థులకు నేర్పాలన్నారు. ఏఐ టూల్స్‌పై విద్యార్థులు అవగాహన కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుందన్నారు. టీచర్స్‌కు కూడా ఏఐ బోధనపై శిక్షణ ఇస్తామన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్ స్కిల్స్ నేర్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పాత్రికేయులు కృషి చేయాలన్నారు. ఈనెల 16న గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే గంగాదేవి బోనాల జాతర పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో సింథటిక్ టెన్నిస్ కోర్టు, చిల్డ్రన్స్ పార్కు, ఆర్సీ కట్ట ఆధునికీకరణ పనులు, అయ్యాగారి చెరువులు, గంగాపురి వద్ద సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపనతోపాటు బోయినిపేట ఏకో పార్కు వద్ద చిల్డ్రన్ పార్కును ప్రారంభించారు. రామగిరి, ముత్తారం, మంథని, కమాన్‌పూర్ మండలాల ప్రభుత్వ పాఠశాలలకు సీఎస్ఆర్ కింద మంజూరైన డ్యూయల్ డెస్క్, కుర్చీలను జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో పంపిణీ చేశారు. సీడ్స్ ఎన్‌జీవో ద్వారా నిర్మించిన డిజిటల్ క్లాస్‌లను, లైబ్రరీని ప్రారంభించారు. పోచమ్మవాడలో పాల కేంద్రం వద్ద ప్రభుత్వం, ఉషా ఇంటర్నేషనల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మహిళా కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టోర్ సందర్శించారు. సీతారామ సేవా సదన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన గ్యాస్ ఆధారిత జ్వాలన యంత్రాన్ని ప్రారంభించారు. మంథని ప్రెస్‌క్లబ్‌ను సందర్శించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, ఆర్డీవో సురేష్, శ్రీసీతారామ సేవా సదన్ వ్యవస్థాపకులు నారాయణ గురూజీ, అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు, కాంగ్రెస్ నేతలు శశిభూషన్‌కాచే, వొడ్నాల శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్, ఉప్పట్ల శ్రీనివాస్, ఐలి ప్రసాద్, సతీష్, సెగ్గెం రాజేష్, ముస్కుల సురేందర్‌రెడ్డి, మూల సరోజనలు పాల్గొన్నారు.

నేడు తొలి ఏకాదశి

- ప్రారంభంకానున్న పండుగలు
- చాతుర్మాస్య దీక్షలు
- ఆలయాల్లో పూజలు, గృహాల్లో విందులు

సుల్తానాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆషాఢ శుద్ధ ఏకాదశి తొలి ఏకాదశి పర్వదినాన్ని ఆదివారం జరుపుకోనున్నారు. ఆషాఢ మాసం శుక్ల పక్ష ఏకాదశి నాడు విష్ణుమూర్తి పాలకడలిపై యోగ నిద్రలోకి వెళ్ళే సందర్భాన్ని తొలి ఏకాదశిగా పరిగణిస్తారు. తొలి ఏకాదశి నుంచి వరుసగా పండు గలు వస్తుంటాయి. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశిలలో తొలి ఏకాదశికి విశిష్టత ఉంది.

ఈ మాసం, వాతావరణం తొలకరి ప్రారం భంతో వర్షాలు కురిసి పంటలకు అనుకూలంగా మారుతాయి. దైవానుగ్రహానికి, పండు గల ప్రారంభానికి కారణమైన ఈ రోజున ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హవనాలు నిర్వహిస్తారు. నదీ స్నానాలు, పుణ్యక్షేత్ర దర్శనాలు, వ్రతాలు, దానధర్మాలు ఆచరిస్తారు. ఇళ్లలో పిండి వంటలు చేస్తారు. రైతులు వేడుకగా జరుపుకునే ఈ ఏకాదశినే పూర్వం సంవత్సరారంభంగా పరిగణించేవారు. ప్రకృతి వైపరీత్యాలు రావద్దని, పంటలకు తెగుళ్ల సోకవద్దని రైతులు ప్రార్థిస్తారు. చాతుర్మాస్య దీక్షల్లో భాగంగా గృహస్తులు, స్వామీజీలు, యతీశ్వరులు, పీఠాధిపతులు 4 నెలలకు పైగా దీక్షల్లో ఉంటారు.

● **ఏకాదశి వ్రత మహత్యం**

పవిత్ర ఆధ్యాత్మిక ముక్తిప్రద దినం తొలి ఏకాదశి. దీనికే హరి దినమని మరో పేరు ఉంది. ఏకాదశి వ్రతంలో ఉన్న విశిష్టత పద్మపురాణం ద్వారా తెలుస్తుంది. త్రిమూర్తులలో శ్రీహరితో ముడిపడిన ఈ ఏకాదశి మహత్యం గురించి అనేక కథలు పురాణాల్లో ఉన్నాయి. కష్టాల్లో తలమునకలవుతున్న మానవ జాతిని కాపాడడానికి శ్రీహరి ఈ ఏకాదశిని ఏర్పాటు చేశాడని, వ్రతాన్ని నియమనిష్టలతో ఆచరిస్తే సమస్త వ్యాధుల నుంచి విముక్తి పొందుతారని చెబుతారు.



● **గో పద్మ వ్రతం**

తొలి ఏకాదశి పండుగ రోజునే మహిళలు గోపద్మ వ్రతాన్ని ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని తొలి ఏకాదశి నుంచి మొదలుకొని కార్తీక మాస శుక్ల పక్ష ద్వాదశి వరకు ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని ఆచరించే వారు దశమి నాడు రాత్రి నిహారులై ఉండి ఏకాదశి నాడు సూర్యోదయానికి ముందు శ్రీహరిని పూజించాలి. ద్వాదశి రోజు అన్నదానం చేయడం మంచిది.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక
రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి
8

గ్రీన్‌ఫీల్డు హైవే నిర్మాణంతో పోతారం గ్రామానికి ముప్పు

- బ్రిడ్జి నిర్మాణాన్ని పొడిగించాలంటున్న గ్రామస్థులు

మంథనిరూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): నాగ్‌పూర్-విజయవాడ వరకు కొనసాగుతున్న నేషనల్ గ్రీన్‌ఫీల్డు హైవే నిర్మాణంతో మండలంలోని పోతారం గ్రామానికి గోదావరి వరద ముంపు గురయ్యే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పౌవునూరు నుంచి గోదావరినది మీదుగా మండలంలోని పోతారం గ్రామంలోకి నేషనల్ హైవే నిర్మాణం ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా పౌవునూరు-పోతారం గ్రామాల మధ్య గోదావరినది పై హైవే బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నారు. అయితే బ్రిడ్జి నిర్మాణం కోసం పోతారం వద్ద గోదావరి నది ఒడ్డు వరకు చేపట్టడంతో బ్రిడ్జి ఆనుకొని హైవేను 15 ఫీట్ల ఎత్తుతో రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నారు. వర్షాకాలంలో గోదావరి నది నీటి ప్రవాహం పెరిగినప్పుడు గ్రా మానికి వరద నీటి కారణంగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉం దని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే భారీ వర్షాలు పడినప్పుడు నది ప్రవాహం పెరిగినప్పల్లా గ్రా మంలోకి, శివారులోకి వరద ప్రవాహం వస్తోంది. ఇండ్లు, వ్యవసాయ పంటలకు నష్టం జరుగతుందని గ్రామస్థులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. నేషనల్ హై బ్రిడ్జి నిర్మాణాన్ని మరో 5 వందల మీటర్లు ఒడ్డు వైపు పొడిగిస్తే నీటి ప్రవాహం వెళ్ళిపోయే పరిస్థితి ఉంటుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఇలాగే ఒడ్డు వరకు బ్రిడ్జిని, 15 మీటర్ల ఎత్తులో రోడ్డు నిర్మిస్తే గ్రామం వరద నీటి ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఈ విషయాన్ని హైవే ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి తమ గ్రామానికి బ్రిడ్జి, రోడ్డు నిర్మాణాలతో వరద ముంపు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బ్రిడ్జి నిర్మించే ప్రదేశం

బ్రిడ్జి నిర్మాణాన్ని పొడిగించాలి

దాసరి గట్టయ్య, మాజీ సర్పంచ్



పోతారం వద్ద గోదావరి నదిపై నిర్మించే నేషనల్ హైవే బ్రిడ్జి నిర్మాణాన్ని 5వందల మీటర్ల వరకు పొడిగించాలి. బ్రిడ్జి నిర్మా ణం పొడిగించడం వలన గ్రామా నికి వ్యవసాయం భూములకు వరదల వలన నష్టం జరగకుండా ఉంటుంది. బ్రిడ్జి నిర్మాణాన్ని గోదావరి నది వరకే నిర్మిస్తే గ్రామానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

అధికారులు న్యాయం చేయాలి

- ఎడ్ల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ.



పోతారం గ్రామం వద్ద నిర్మించే బ్రిడ్జి, నేషనల్ హైవే పై అధికారులు స్పందించి గ్రామానికి న్యాయం చేయాలి. బ్రిడ్జి వద్ద నుంచి గ్రామం మీదుగా 15 ఫీట్ల ఎత్తు పై రోడ్డు నిర్మిస్తే గోదావరి వరద వలన గ్రామం మునిగిపోయే పరిస్థితి నెలకొంది. ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని అధికారులు స్పందించి గ్రామస్థులకు న్యాయం చేయాలి.

సమ్మె విజయవంతం చేయాలని బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గోదావరిఖని, జూలై 5(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఖనిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ ఆర్‌జీ-1 బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో గోదా వరిఖని శ్రామిక భవన్ నుండి మెయిన్ చౌరస్తా, తిలక్‌నగర్, రమేష్‌నగర్, కళ్యాణ్ నగర్ మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తూ లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని, ఈ కోడ్స్ అమలైతే కార్మిక హక్కులు కోల్పోతారని, పెట్టుబడుదారులకు అనుకూలంగా ఉన్న ఈ చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని, వేలం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జీ-1 అధ్యక్ష కార్యదర్శులు ఆరేపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, అనరి మహేష్, అనబోయిన శంకరన్న, పుప్పాల శ్రీనివాసరావు, పెండెం సమ్మయ్య, నంది నారాయణ, పిరుమల శ్రీనివాస్, జంగాపల్లి మల్లేష్, తాళ్లపల్లి శ్రీనివాస్, ఇప్పలపల్లి సతీష్, దుర్గాప్రసాద్, పాలేటి నరేష్, జనార్ధన్, భీమా నాయక్, తిప్పారపు రాజు, ఏ సతీష్, ముల్కల శ్రీకాంత్, సుమన్ కుమార్, సీహెచ్ శ్రీధర్, మునుకుంట్ల రామన్న, మహేందర్, ఎం రాజేష్ పాల్గొన్నారు,

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తిమ్మాపూర్(మానకొండూర్), జూలై 5 (ఆంధ్రజ్యోతి): అల్గునూర్‌లో శనివారం ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. మానకొండూర్ మండలంలోని లింగాపూర్ మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. డ్రైవర్ వరికొప్పుల అంజనేయులు, యజమాని దయ్యాల శేఖర్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి విఫలయత్నం

పెద్దపల్లిరూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నిట్టూరు గ్రామంలో శుక్రవారం రాత్రి పంట పొలాలవద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తుకెళ్లేందుకు దొంగలు ప్రయత్నించినట్లు రైతులు తెలిపారు. తుర్కమద్దికుంట-నిట్టూరు గ్రామాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగిలించేందుకు ప్రయత్నించగా స్తంభానికి గట్టిగా బిగించి ఉండడంతో వదిలివెళ్లారు. విద్యుత్‌శాఖ ఏఈరవిచందర్ గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా కనపడితే విద్యుత్‌శాఖ లేదాపోలీస్‌లకు సమాచారం అందించాలని కోరారు.

ఒకరి బైండోవర్

కరీంనగర్ క్రైం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అనుమతిలేకుండా నగునూర్ వాగునుంచి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న గ్రామానికి చెందిన ఒర్సునర్సయ్యను శనివారం బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. రూరల్‌తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు, సొంతపూచీకత్తుపై విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

మాంసం మంచిదేనా?

- నిబంధనలు విస్మరించి యథేచ్ఛగా విక్రయాలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఎల్లారెడ్డిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలంలో మాంసం వ్యాపారులు నిబంధనలను విస్మరించి యథేచ్ఛగా విక్రయాలు సాగిస్తున్నారు. కుళ్లిన మాంసం అమ్ముతూ ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, వెంకటాపూర్, బండలింగంపల్లి, కోరుట్లపేట, సింగారం తదితర గ్రామాల్లో మాంసం వ్యాపారులు నిబంధనలు పాటించకుండా అమ్మకాలు సాగిస్తుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

జీవాలకు వ్యాధులు..

మండలంలోని మాంసం వ్యాపారులు గొర్రెలు, మేకలను కామారెడ్డి, దుబ్బాక, వెంకటాపూర్ తదితర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి విక్రయానికి తీసుకవస్తున్నారు. జీవాల్లో తరచుగా గోట్ ప్యాక్స్, నిమోనియా, ఫుట్‌రాట్, పీపీఆర్ వంటి వ్యాధులు సోకుతాయని పశు వైద్యాధికారులు పేర్కొంటున్నారు. రోగాల బారిన పడిన వాటికి వెంటనే చికిత్స చేయించాలని, వాటిని తినడం మంచిది కాదని స్పష్టం చేస్తున్నారు. కానీ వ్యాపారులు అస్వస్థతకు గురైన జీవాలను వధించి రూ.800లకే అనారోగ్యం అట్టగడుతున్నారు. పలుమార్లు మాంసం విక్రయాలపై ప్రజలు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడం వల్ల వ్యాపారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. రెండు, మూడు రోజులుగా నిల్వ మాంసాన్ని విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పరీక్షించకుండానే..

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని వ్యాపారులు నిత్యం సుమారు 50 జీవాలను వధిస్తున్నారు. ఆదివారం సుమారు 150 వరకు వధించి అమ్మకాలు సాగిస్తుంటారు. గొర్రెలు, మేకలను సంబంధిత శాఖ అధికారులు పరీక్షించిన తర్వాతనే వధించాల్సి ఉంటుంది. జీవాలు ఆరోగ్యంగా ఉన్నాయని పశు వైద్యాధికారులు ధ్రువీకరించిన అనంతరం వధించాలి. కానీ మండలంలో ఎక్కడా అవి అమలు కావడం లేవు. కనీసం అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. గ్రామాల్లో ఎక్కడా వధశాలలు లేకపోవడం వల్ల వ్యాపారులు ఇళ్లలో అపరిశుభ్రత నడుమ వధించి విక్రయ కేంద్రానికి తీసుకవస్తున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద డబ్బాలను ఏర్పాటు చేసుకుని మాంసం విక్రయాలు సాగిస్తున్నారు. డబ్బాల చుట్టూ అపరిశుభ్రత మధ్యనే అమ్మకాలు కొనసాగిస్తున్నారు.

జీపీ తీర్మానాలు లేకపోవడం వల్ల..

- జంపల రాహుల్, పశు వైద్యాధికారి, ఎల్లారెడ్డిపేట



మండలంలోని ఆయా గ్రామాల్లోని పాలకవర్గాలు, సంబంధిత శాఖ అధికారులు జీవాలను వధించడంపై తమకు ఎలాంటి తీర్మాన పత్రాలు అందించకపోవడం వల్ల పరీక్షలు చేయలేకపోతున్నాం. వ్యాపారులు అస్వస్థతకు గురైన గొర్రెలు, మేకలను వధిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. వ్యాపారులు ఒకరోజు ముందే వధించే వాటి వివరాలను తెలియపరిచాలి. కానీ మా వద్దకు వ్యాపారులు రావడం లేదు. ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటాం.

వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం

- జోగం రాజు, ఎంపీవో, ఎల్లారెడ్డిపేట



మండలంలోని ఆయా గ్రామాల్లో మాంసం వ్యాపారులు విధిగా గ్రామ పంచాయతీ అనుమతులు పొంది ఉండాలి. పశు వైద్యాధికారులు పరీక్షించిన గొర్రెలు, మేకలను మాత్రమే వధించాలి. గ్రామాల్లో మాంసం విక్రయాలపై తనిఖీలు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశిస్తాం. నిబంధలను పాటించకుండా మాంసం అమ్మకాలు సాగిస్తే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.

వొకేషనల్ కోర్సుల బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

భగత్‌నగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ప్రవేశపెట్టిన ఏఅండ్‌టీ, ఐఅండ్ఎం కోర్సులు బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. వొకేషనల్ పోస్టులకు పూర్తిగా తాత్కాలిక పద్ధతిలో నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈనెల8వ తేదీన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ గురుకుల విద్యాలయంలో డెమో ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారికి అనుభవాన్నిభట్టి గరిష్ఠంగా రూ.48 వేలవేతనం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు సొసైటీఅధికారిక వెబ్‌సైట్ tgswreis.telangana.gov.inలో సందర్శించాలని, హెల్ప్‌లైన్‌నంబర్లు 04023391598, 9000049542లో సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

పెద్దపల్లి రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మేరపల్లికి చెందిన బత్తిని కొమురయ్యకు చెందిన మేక శనివారం మేతకోసం పొలాలవైపు వెళ్లింది. అక్కడ ఉన్న విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ వైరు తగలడంతో షాక్‌కు గురై మృతిచెందింది. మృతిచెందిన మేక రూ.15వేల వరకు ఉంటుందని ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతు కోరాడు.

బైక్ చైన్‌లో చీర ఇరుక్కొని.. మహిళకు తీవ్ర గాయాలు



బైక్ చైన్‌లో చీర కొంగు ఇరుక్కుని కిందపడిన మహిళ

కథలాపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం తాండ్ర్యాల శివారులో శనివారం బైక్‌పై ప్రయాణిస్తున్న ఓ మహిళ చీర చైన్‌లో ఇరుక్కోవడంతో గాయాలయ్యాయి. చందుర్తి మండలం సనుగులకు చెందిన గంట కొమురవ్వ తన భర్త అంకుష్‌తోకలిసి బైక్‌పై గంభీర్‌పూర్ వెళ్లి తిరిగి వస్తుండగా తాండ్ర్యాల శివారులో కొమురవ్వ చీర చైన్‌లో ఇరుక్కుంది. దీంతో కొమురవ్వ కిందపడి కొంతదూరం బండితో తోసుకుపోయింది. ఈ ఘటనలో కొమురవ్వ కాలు, చేతికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే గ్రామస్థులు చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్ర



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్ర చేస్తోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై పూటకోమాట మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి వత్తాసు పలుకుతోందన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు పేరుతో గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధిని ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. ప్రతీ విద్యార్థికి ఆర్టీసీలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రామ రావు వెంకటేష్, మచ్చ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెదడు సంబంధిత వ్యాధితో ఇంటర్ విద్యార్థిని మృతి



సాత్విక(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఇంటర్ విద్యార్థిని విశ్వనాథుల సాత్విక(16) మెదడు సంబంధిత వ్యాధితో శనివారం మృతిచెందిందని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. గ్రామంలోని విశ్వనాథుల కవిత-పూర్ణచందర్ దంపతుల కూతురు సాత్విక కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. రెండురోజుల కిందట అనారోగ్యానికి గురైంది. దాంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెదడులో రక్తం గడ్డ కట్టడంతో పరిస్థితి విషమించి విద్యార్థిని సాత్విక మృతిచెందింది.

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి

జమ్మికుంట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన జమ్మికుంట మున్సిపల్ పరిధిలో శుక్రవారం జరిగింది. పట్టణ సీఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. టేకుమట్ల మండలం వెంకట్రావుపల్లికి చెందిన జోడు కుమార్(27) జమ్మికుంట నుంచి స్వగ్రామం వెళ్తుండగా కొత్తపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఎదురుగా బైక్‌పై వస్తున్న రామన్నపల్లికి చెందిన పూర్లె మధుకర్ ఢీకొన్నాడు. దీంతో కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు కుమార్ తల్లి జోడు సమ్మక్క ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి



రిషి(ఫైల్)

వేములవాడ టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి బాలుడు మృతిచెందిన సంఘటన వేములవాడ మండలం చింతలఠాణ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చింతలఠాణ గ్రామానికి చెందిన లింగంపల్లి రవి స్వప్నల కుమారుడు రిషి(4) అనే బాలుడు తోటి బాలలతో ఆడుకుంటూ ఇంటి పక్కన నిర్మాణంలో ఉన్న ఇంటివద్ద ఆడుకుంటుండగా ప్రమాదవ శాత్తు నీటిసంపులో పడి మృతిచెందినట్లు తెలిపారు.

రైల్వేట్రాక్‌పై వృద్ధుడి ఆత్మహత్య



నర్సయ్య గౌడ్

రామడుగు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం దేశరాజుపల్లి శివారులోని రైల్వేట్రాక్‌పై ఓ వృద్ధుడు శనివారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దేశరాజ్‌పల్లి గ్రామస్థుల కథనం ప్రకారం.. బొడిగ నరసయ్యగౌడ్(65)కు భార్య, పిల్లలు ఎవరూ లేకపోవడంతో మండలంలోని వెలిశాల గ్రామంలో అనాథాశ్రమంలో ఉంటున్నాడు. అనారోగ్య కారణాలతో బయటకు వచ్చిన నరసయ్యగౌడ్ శనివారం సాయంత్రం రైల్వేట్రాక్‌పై పడుకున్నాడు. రైలుపై నుంచి వెళ్లడంతో తల మొండెం వేరై మృతిచెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రహదారిని కమ్మేస్తున్న కంప చెట్లు

● రాకపోకలకు ఆటంకం ● పట్టించుకోని అధికారులు



కుమ్మరిపల్లి సమీపంలో రోడ్డుపైకి విస్తరించిన కంప చెట్లు

వెల్గటూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ నుంచి కుమ్మరిపల్లి మధ్య రహదారికి ఇరువైపులా కంప చెట్లు పెరిగి రోడ్డును కమ్మేస్తున్నాయి. ప్రధాన రహదారి వెంబడి ఉన్న ముళ్లచెట్లు, పిచ్చి మొక్కలు వాహనదారులకు ఇబ్బందికరంగా మారాయి. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరగడంతో రాత్రి సమయాల్లో అవి కనబడక ద్విచక్రవాహనాలపై వెళ్లే ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. ఎదురుగా భారీవాహనాలు వచ్చినపుడు పక్కకు వెళితే ద్విచక్రవాహనదారులకు కంపచెట్లు తగిలిగాయాలు అయిన సందర్భాలు ఉన్నాయి. రహదారులను ఆక్రమిస్తున్న కంపచెట్లను తొలగించేందుకు పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

కొత్తగట్టులో పర్యటించిన ఢిల్లీ ఎన్‌జీవో బృందం



ఎన్‌జీవో బృందం సభ్యులకు స్వాగతం పలుకుతున్న అధికారులు, గ్రామస్థులు

శంకరపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్-2025 కార్యక్రమంలో భాగంగా అకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఢిల్లీ ఎన్‌జీవో బృందం శనివారం పర్యటించింది. ఈ సందర్భంగా బృంద సభ్యులు రాణి, రజిత గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాల అమలుతీరు, స్వచ్ఛత, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల, అంగన్‌వాడీకేంద్రం, ఆలయంతోపాటు గ్రామంలో ఇంటింటా వివరాలు అడిగి నమోదుచేసుకున్నారు. ఇళ్లలో మరుగుదొడ్ల వినియోగం, డ్రైనేజీలు, ఇంకుడు గుంతలు, తడి, పొడి చెత్త వినియోగించే బుట్టలు, చెత్త తరలింపు, కంపోస్టు షెడ్లలో ఎరువుల తయారీ, డ్రైనేజీ చివర కమ్యూనిటీ సోఫ్ పీట్స్ వంటి అంశాలపై సర్వే నిర్వహించి వివ రాలు నమోదు చేసుకున్నారు. నివేదికను కేంద్రప్రభుత్వానికి అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎంపీవో ప్రభాకర్, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్, వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుపై రాళ్లు రువ్విన ఆకతాయిలు

● ప్రయాణికుడికి గాయాలు



బస్సుపైకి విసిరిన బండరాయిని చూపుతున్న డ్రైవర్

శంకరపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ఎరడపల్లి-అర్కండ్ల గ్రామాల మధ్యలో ఓ ఆర్టీసీ బస్సుపై ఆకతాయిలు బండరాళ్లు విసిరారు. ఈ ఘటనలో ఓ ప్రయాణికుడు గాయపడ్డాడు.. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి కరీంనగర్ నుంచి ఎరడపల్లి, అర్కండ్ల, గంగారం మీదుగా చల్లూరు వెళ్తున్న బస్సుపై ఎరడపల్లి శివారులో గుర్తుతెలియని వ్యక్తులు బండరాళ్లు విసిరారు. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న గంగారం గ్రామానికి చెందిన లక్ష్మణ్ అనేవ్యక్తికి గాయపడ్డాడు. గమనించిన డ్రైవర్ బస్సు ఆపాడు. బస్సు డ్రైవర్, ప్రయాణికులు చుట్టుపక్కల వెతికారు. అప్పటికే బండరాళ్లు విసి రిన వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు.

రైతుకు విద్యుదాఘాతం

- ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ అమరుస్తుండగా ఘటన
- విచారణ చేపట్టిన ఏడీఈ

కథలాపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం తాండ్ర్యాలలో ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫ్యూజ్ వేసేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో సబ్‌స్టేషన్ నుంచి సిబ్బంది విద్యుత్ సరఫరా చేయడంతో జరుపుల హామ్యానాయక్ అనే రైతు విద్యుదాఘాతానికి గురయ్యాడు. పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫ్యూజ్ ఎగిరిపోవడంతో మరమ్మత్తు చేయడానికిగాను ఎన్‌పీడీసీఎల్ సిబ్బందికి లైన్‌క్లియర్ చేయాలని కోరాడు. దీంతో లైన్‌క్లియర్ (ఎల్‌సీ) చేసినట్టు విద్యుత్ సిబ్బంది సమాచారం ఇవ్వడంతో ఫ్యూజ్‌ను రైతు సరిచేస్తున్నాడు. సబ్‌స్టేషన్‌లో ఉన్న ఆపరేటర్ ఒక్కసారిగా విద్యుత్‌సరఫరా చేయడంతో హామ్యానాయక్ విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. భుజంపై తీవ్రగాయాలైన రైతును చికిత్స నిమిత్తం జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై ఏడీఈ బొప్పరాతి రఘుపతి అంబారిపేట సబ్‌స్టేషన్‌లో విచారణ జరిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి సిబ్బంది రైతుతో ఫ్యూజ్ ఎందుకు వేయించాల్సి వచ్చిందనే కోణంలో విచా రణ చేపట్టారని తెలిసింది. ఈ విషయమై ఏడీఈని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా రైతుకు ఎలాంటి ప్రాణాప్రాయం లేదని చికిత్స కొనసాగుతోందని చెప్పారు.

అధికారులకు నెమలి అప్పగింత



ఫారెస్ట్ అధికారులకు నెమలిని అప్పగిస్తున్న స్థానికులు

మైటింక్లయిన్‌కాలనీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరు గ్రామంలో శనివారం రాత్రి నెమలిపై కుక్కలు దాడిచేస్తుండగా స్థానికులు గుర్తించి కాపాడారు. టుటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా ఫారెస్ట్ అధికారులు అక్కడికి చేరుకుని నెమలిని స్వాధీనం చేసుకున్నారు.

సర్వేలతోనే సరి

- జాతీయ రహదారి విస్తరణకు ముందుకు పడని అడుగులు
- రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ
- నిత్యం ఏదో ఒక చోట జరుగుతున్న ప్రమాదాలు

గంగాధర, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 563 విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు. ఏళ్లుగా అధికారులు సర్వేలతోనే సరిపెడుతున్నారు. రెండేళ్లుగా ఒక్కడుగు ముందుకు పడడం లేదు. సర్వేలు చేసి నిర్వాసితులకు పరిహారం అందిస్తేనే పనులు ప్రారంభమయ్యేది. కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ పెరుగుతూనే ఉంది. నిజామాబాద్, బాసర, కొండగట్టు పుణ్యక్షేత్రాలకు నిత్యం వందలాది వాహనాలు నడుస్తుంటాయి. జాతర సమయంలోనైతే రద్దీ మరింత పెరుగుతుంది. మూడేళ్లుగా జాతీయ రహదారి నాలుగులైన్ల నిర్మాణం కోసం భూసర్వే కొనసాగుతూనే ఉంది. గంగాధర మండలంలో జాతీయ రహదారి కొండన్నపల్లి, కురిక్యాల, మధురానగర్, మంగపేట, ఇస్లాంపూర్, వెంకటయ్యపల్లి గ్రామాల మీదుగా జాతీయ రహదారి వెళుతుంది. రోడ్డు నిర్మాణంలో వ్యవసాయ భూములు, బావులు, చెట్లు, ఇళ్లపై అధికారులు నిర్వహిస్తున్న సర్వేలు కొలిక్కి రాలేదు. జాతీయ రహదారిలో భూములు, ఇళ్లు కోల్పోతున్న బాధితులు పరిహారం ఎప్పుడొస్తుందాని ఎదురు చూస్తునే ఉన్నారు. రెండు లైన్ల రోడ్డు కావడంతో తరచూ ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కరీంనగర్, నిజామాబాద్ వరకు రహదారిపై వాహనాల రాకపోకలు అధికంగా సాగుతున్నాయి. అధికారులు భూ సర్వే వేగవంతం చేసి రహదారి విస్తరణ పనులు మొదలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గంగాధరలో రెండు లైన్ల ప్రధాన రహదారి

పాఠశాలలో విటమిన్ గార్డెన్

- ఆదర్శం ఉల్లంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల
- ప్రధానోపాధ్యాయుడి సొంత ఖర్చులతో ఏర్పాటు



ఉల్లంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విటమిన్ గార్డెన్

చిగురుమామిడి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది. ప్రాథమికోన్నత పాఠ శాలలో ఉపాధ్యాయులు తమ సొంత ఖర్చులతో గ్రీన్ మ్యాట్‌ను ఏర్పాటు చేసి అందులో విటమిన్ గార్డెన్ ఏర్పాటు చేశారు. ఆకుకూరలు, ఇతర కూరగాయాలను పండించి వాటినే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వండి పెడుతున్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే ఆలోచనతో జిల్లాకలెక్టరు సూచన మేరకు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు. మధ్యాహ్నభోజనంలో ఇక్కడ పండించిన ఆకు కూరగాయలను మాత్రమే ఉపయోగించాలనే ఆదేశాలు ఉన్నాయి. ప్రతి రోజు గార్డెన్‌కు నీళ్లు పెట్టడం, కలుపు తీయడం చేస్తున్నారు. మొక్కలకు సేంద్రియ ఎరువులను మాత్రమే వాడుతున్నారు. పూర్తిగా శాస్త్రీయపరమైన విధంగానే గార్డెన్‌లో కూరగాయాలు పండించేందుకు కృషి చేస్తున్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి గ్రామస్థులు వారిని ఎంతో అభినందిస్తున్నారు. ఇదే విధంగా మండలంలోని మిగితా ప్రభుత్వపాఠశాలల్లో సైతం విటమిన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని గార్డెన్ ఏర్పాటు

- ఎ పావని, ఎంఈవో, చిగురుమామిడి

మండలంలోని అన్ని ప్రభుత్వపాఠశాలల్లో జిల్లా కలెక్టరు ఆదేశాలతో విటమిన్ గార్డెన్లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కుంటున్న విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఇలాంటి కార్యక్ర మాలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ప్రస్తుతం ఎలాంటి నిధులు రాలేదు. ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నారు. నిధులు వచ్చిన తర్వాత ప్రధానోపాధ్యాయులకు సంబంధిత ఖర్చులు చెల్లిస్తాం.

కులగణన సర్వేపై భేషజాలు వద్దు

● మంత్రి శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సామాజిక దృక్పథంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుల గణన సర్వే పై రాజకీయ పార్టీలు భేషజాలకు పోవద్దని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో కులగణన సర్వే చేపట్టామన్నారు. కుల గణన, వర్గీకరణ కోసం అసెంబ్లీల్లో చట్టం చేసి తమ నిబద్ధతను చాటుకున్నామన్నారు. సర్వేలో ఎక్కడైనా ఎవరికైనా ఇబ్బంది జరిగితే తిరిగి సర్వే పొడిగించి అందరూ సర్వే పరిధిలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కులగణన సర్వేతో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్న తరుణంలో బండి సంజయ్ దీనిపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అతని ఉద్దేశ్యం కులగణన చేయవద్దని అనడమా అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని చూసి దేశంలో సైతం కులగణన సర్వే చేయాలని ప్రధాని మోదీ అంటున్నార న్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే కులగణన సర్వే కూడా సంజయ్ వద్దంటారా అని ప్రశ్నించారు.

ఆషాఢ శుద్ధ పౌర్ణమికి అరుణాచలానికి ప్రత్యేక బస్సు

భగత్‌నగర్, జులై 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల ఆషాఢ శుద్ధ పౌర్ణమికి కరీంనగర్-1 డిపో నుంచి అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక బస్సు నడిపిస్తున్నట్లు కరీంనగర్ డిపో-1 మేనేజర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదీన కరీంనగర్ నుంచి బయలుదేరి 9న కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ అనతరం అదే రోజు రాత్రి అరుణాచలం క్షేత్రానికి చేరుతుందని పేర్కొన్నారు. గిరిప్రదక్షిణ, దర్శనం అనంతరం అరుణాచలం నుంచి 10వ తేదీ మధ్యాహ్నం బయల్దేరి మరుసటి రోజు జగులాంబ దర్శనం ఉంటుందని, 11వ తేదీ సాయంత్రం కరీంనగర్‌కు చేరుతుందని తెలిపారు. బస్సులో పెద్దలకు రూ.4700, పిల్లలకు రూ.3540 రూపాయలుగా టికెట్ ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ : 9959225920, 8074690491, 7382849352 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్షయ నియంత్రణే లక్ష్యంగా..



- జిల్లాలో కొనసాగుతున్న టీబీ ముక్త్ భారత్ అభియాన్
- మొదటి విడతలో 550 మంది గుర్తింపు
- కొనసాగుతున్న రెండో విడత పరీక్షలు

సుభాష్‌నగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): భారతదేశాన్ని 2025 నాటికి క్షయ రహిత దేశంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది.

● ఎవరికి టీబీ వచ్చే అవకాశం ఉంది...

టీబీ వ్యాధి ఎవరికి వస్తుందనే అనుమానం చాలామందిలో ఉంది. పాత టీబీ పేషంట్లకు, వారితో కలిసి పనిచేసినవారు లేదా కుటుంబ సభ్యులకు క్షయ సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ రవిందర్‌రెడ్డి తెలిపారు. 60 సంవత్సరాలు పై ఉన్న షుగర్ పేషంట్లు, మద్యపానం, దూమపానం అలవాట్లు ఉన్నవారు, కిడ్నీ, హెచ్ఐవీ, క్యాన్సర్ పేషంట్లకు, పత్తి మిల్లులో, సిమెంట్ ఫ్యాక్టరీ, హైండ్లూమ్ పరిశ్రమలతోపాటు ఇతర పరిశ్రమలలో పనిచేసేవారికి టీబీ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు.

● లక్షణాలు.....

మూడ వారాల కంటే ఎక్కువ కాలం ఉండే దగ్గు టీబీ లక్షణం కావచ్చు. దగ్గినపుడు కఫం లేదా రక్తంతో కూడిన కఫం రావచ్చు. మధ్యాహ్నం లేదా సాయంత్రం వేళల్లో జ్వరం రావడం, రాత్రిపూట విపరీతంగా చెమటలు పట్టడం, బరువు తగ్గడం, అలసటగా లేదా బలహీనంగా ఉండడం, ఆకలి తగ్గిపోవడం టీబీ లక్షణాలు. కొన్నిసార్లు ఛాతి నొప్పి, కొన్ని సందర్భాల్లో వెన్నునొప్పి, కండరాల నొప్పి, వాపు వంటి లక్షణాలు కనిపించవచ్చు.

● డిసెంబరులో మొదటి విడత ప్రారంభం

2024 డిసెంబరు 7న మొదటి విడత ప్రారంభించారు. ఆశ వర్కర్లు ఇంటింటికి తిరిగి టీబీ లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వారిని సంబంధిత ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సూచిస్తారు. వారు అక్కడికి వెళ్లిన వారికి ముందుగా తెమడ పరీక్ష నిర్వహిస్తారు. అవసరైమన వారికి ఎక్స్‌రే తీయిస్తారు. టీబీ ఉన్నట్లు నిర్ధారణ అయితే వారికి 10 వేల నుంచి 1.5 లక్షల రూపాయల మందులను ఉచితంగా అందచేస్తారు. చికిత్స పొందినంత కాలం రోగికి పౌష్టికాహారం కోసం నెలకు వెయ్యి రూపాయలు ఇస్తారు. ప్రభుత్వం నేరుగా రోగుల బ్యాంకు ఖాతాలోనే జమ చేస్తుంది. 2025 మార్చిలో ఈ పరీక్షలు చేయడం ముగియగా, ఈ మూడు నెలల కాలంలో మొత్తం 14,000 మందికి పరీక్షలు నిర్వహించగా వారిలో 550 మందికి టీబీ ఉన్నట్లు గుర్తించారు.

● రెండో విడతలో 74 మంది గుర్తింపు

జూన్ 2న రెండో విడత టీబీ పరీక్షలు ప్రారంభించారు. ఈనెల 3 వరకు 3 వేల మందినికి పరీక్షలు నిర్వహించగా 74 మందికి టీబీ నిర్ధారణ అయ్యింది. ఇంకా పరీక్షలు కొనసాగుతున్నాయి. టీబీ పరీక్షా కేంద్రాలు కరీంనగర్ జిల్లా జనరల్ ఆసుపత్రితోపాటు హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి, జమ్మికుంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తోపాటు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీ నిర్ధారణ పరీక్షలు పూర్తి ఉచితంగా నిర్వహిస్తారు.

లక్షణాలు ఉన్నవారు పరీక్షలు చేసుకోవాలి..

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, జిల్లా టీబీ నియంత్రణ అధికారి

లక్షణాలు ఉన్నవారు సమీపంలో ఉన్న ఏదైనా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి టీబీ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి. వ్యాధిని ప్రారంభదశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. ఇతరులకు సోకకుండా జాగ్రత్త పడవచ్చు. ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. అత్యాధునిక పరీక్ష యంత్రాలు ఉన్నాయి. గతంలో కంటే ఇపుడు మంచి మందులు అందుబాటులో ఉన్నాయి.

జెట్‌స్కీలను తరలించేందుకు టూరిజం అధికారుల యత్నం

● అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులు ● సర్వీసింగ్ కోసమే : టూరిజం అధికారి రాంబాబు

కరీంనగర్ అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో సందర్శకులు వాటర్ రైడింగ్ చేయడం కోసం ఏర్పాటు చేసిన ఉన్న జెట్‌స్కీ స్కూటర్‌ను శనివారం టూరిజం అధికారులు ఒక వాహనంలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా బీఆర్ఎస్ నాయకులు ఎల్ఎండీ వద్ద అడ్డుకున్నారు. ఈ జెట్‌స్కీ స్కూటర్ టూరిజంకు చెందినది కాదని, సీఎం అస్యూరెన్స్ నిధులతో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిందని, దీనిని టూరిజం శాఖ అధికారులు హైదరాబాద్‌కు ఏ విధంగా తరలిస్తారని ఎల్ఎండీలోని బీఆర్ఎస్ నాయకులు వాహనాన్ని అడ్డుకున్నారు. మరో వైపున ఎల్ఎండీలోని లేక్ పోలీస్ అవుట్ పోస్ట్ గంగమ్మ గుడి వద్ద కరీంనగర్ నగర శాఖ బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దీంతో ఎల్ఎండీ వరకు జెట్‌స్కీ స్కూటర్‌ను తీసుకువెళ్లిన వాహనాన్ని తిరిగి మానేరు జలాశయం వద్దకు తీసుకువచ్చి జెట్‌స్కీ స్కూటర్‌ను దించి వెళ్లారు. ఈ సంఘటనపై జిల్లా టూరిజంశాఖ అధికారి రాంబాబును వివరణ అడగగా జెట్‌స్కీ స్కూటర్ సర్వీసింగ్ చేయించేందుకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా స్థానికులు అభ్యంతరం తెలిపారన్నారు. అరంతరం కరీంనగర్ మున్సిపల్ కమిషనర్‌ను అనుమతి అడిగామని, సర్వీసింగ్ చేసేందుకు తరువాత తీసుకువెళ్లాలని అనుమతించారని టూరిజం జిల్లా అధికారి తెలిపారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ మాట్లాడుతూ మాజీ మంత్రి గంగుల కమలాకర్ కరీంనగర్ పట్టణాన్ని టూరిజం పరంగా, ఇతర అన్నిరకాల అభివృద్ధిలో హైదరాబాద్ తర్వాత రెండవ స్థానంగా ఉంచేందుకు వందల కోట్ల రూపాయలను తీసుకువచ్చి అభివృద్ధి చేశారని అన్నారు. అందులో భాగంగానే ఎల్ఎండీని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రెండు జెట్‌స్కీ స్కూటర్లను, క్రూయిజ్ బోట్‌ను కొనుగోలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దిండిగాల మహేశ్, ఏవీ రమణ, మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, మైనార్టీశాఖ అధ్యక్షులు మీర్ షౌకత్ అలీ, ప్రధాన కార్యదర్శి వాజిద్ హుస్సేన్, నాయకులు చేతి చంద్రశేఖర్, ఆరె రవి, జల్లోజి శ్రీనివాస్, నారదాసు వసంతరావు, నదీం, వొడ్నాల రాజు పాల్గొన్నారు.



జెట్‌స్కీలను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల వైద్యాధికారికి మెడికల్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ వసంత్‌రావు

సుభాష్‌నగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వసంత్‌రావు మెడికల్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని సంస్కృత భవన్ కమ్యూనిటీ హాలులో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ శాఖ ప్రకటించిన మెడికల్ ఎక్సలెన్స్ అవార్డు-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన ముఖ్య అతిథులుగా హాజరై అవార్డులను ప్రదానం చేశారు. డాక్టర్ వసంత్‌రావు 1991లో ఎంబీబీఎస్, 1998లో పీజీ పూర్తి చేశారు. 1998లో ప్రభుత్వ సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విధుల్లో చేరి, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టు, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్, జిల్లా ప్రోగాం అధికారిగా పనిచేసిన ఆయన ప్రస్తుతం రాజన్నసిరిసిల్ల జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా పనిచేస్తున్నారు. ఉత్తమ ఐఎంఏ అధ్యక్షునిగా, ఉత్తమ ఐఎంఏ కార్యదర్శిగా, ఉత్తమ వైద్యాధికారిగా అవార్డులను అందుకున్నారు. ఆయన సేవలను గుర్తించి ఉత్తమ మెడికల్ ఎక్సలెన్స్ అవార్డు ప్రకటించారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల పూజలు



మాధవానంద సరస్వతికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

ధర్మపురి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. రద్దీ నెలకొంది. నరసింహాడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణలు చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ భక్తులకుసేవలు అందించారు.

● తొగుట పీఠాధిపతి ప్రత్యేక పూజలు

లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని తొగుట పీఠాదిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ, మదుసూధానంద మహా స్వామి శనివారం సందర్శించారు. వారికి ఆలయం పక్షాన అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో వారు ప్రత్యేక పూజలు జరిపారు. ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ తదితరులు వారికి స్వామి వారి శేష వస్త్రం, చిత్రపటం అందించారు.

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలి




బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు

భగత్‌నగర్, జులై 5(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని ఆల్ ట్రేడ్ యూనియన్స్, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహం నుంచి గీత భవన్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయుసి, సిఐటియు, టియుసిఐ జిల్లా కార్యదర్శులు టేకుమల్ల సమ్మయ్య, ఎడ్ల రమేష్, జిందం ప్రసాద్ మాట్లాడుతూ ఈ సమ్మెలో కరీంనగర్ జిల్లా నుంచి లక్ష మంది కార్మిక వర్గం సమ్మె చేయడానికి సిద్ధమయ్యారన్నారు. ఈ సమ్మె జయప్రదానికి ప్రజానీకం సంపూర్ణ మద్దతు తెలియజేసి జూలై 9వ తేదీన గ్రామీణ బంధు, రవాణా బంద్ పాటించాలని విజ్ఞప్తి చేశారు. జూలై 9న కరీంనగర్ జిల్లాలో ఒక లక్ష మంది ఈ సమ్మె పాల్గొంటున్నారన్నారు. కార్మిక వర్గంలో అపూర్వమైన మద్దతు లభించిందన్నారు. కేవలం కార్పొరేట్ కంపెనీలకే మోదీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వ్యాపార సంస్థలు ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేశాయన్నారు. నబ్బండ కార్మికవర్గం లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఐదు సంవత్సరాలుగా కేంద్రంలోని బీజేపీ ఒత్తిడి తీసుకువస్తున్నా కార్మిక వర్గం పట్ల కనికరం చూపించలేదన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చన్న యాదవ్, యు శ్రీనివాస్ మల్లయ్య, కవ్వంపల్లి అజయ్, వడ్ల రాజు, సంపత్, రాయికంటి శ్రీనివాస్ బోయినీ అశోక్‌ప్రధాన కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్, వామన్‌రావు, ఆల్ ట్రేడ్ యూనియన్స్, వ్యవసాయ కార్మిక సంఘాలు, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు పోరాటం

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



సిరిసిల్లలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సిరిసిల్ల టౌన్, జూలై 05 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీకి సెక్యులర్ సోషలిజం పదాలంటే భయం, సమసమాజ స్థాపనకు ఎర్రజెండా పోరాటం చేస్తుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ పట్టణ అధ్యక్షుడు పంతం రవి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. ప్రజా సమస్యలే ఎజెండాగా ఆర్థిక అసమానతలు లేని సమసమాజ స్థాపన కొరకు ఎర్రజెండా పోరాటం చేస్తుందన్నారు. ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా నిత్యం ప్రజల మధ్య నిలబడి వారి సమస్యల పరిష్కారానికి పోరాడే పార్టీ సీపీఐ మాత్రమే అన్నారు. శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని దున్నే వాడికి భూమి కావాలని శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచానికి విప్లవ పాఠాలు నేర్పడంలో సీపీఐ నాయకత్వం వహించిందని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలకు పాల్పడుతూ ప్రజా సమస్యలను విస్మరిస్తూ పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తుందని ఆరోపించారు. పేదవారి నడ్డి విరిచే విధంగా బీజేపీ ప్రభుత్వం మళ్లీ వంట గ్యాస్ సిలిండర్ ధరలను పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర ఇవ్వాలని ఎరువులు విత్తనాలు సబ్సిడీపైన ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న మారణహోమాన్ని కేంద్ర ప్రభుత్వం ఆపాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు, అజ్జ వేణు, మీసం లక్ష్మణ్ పాల్గొన్నారు.

గోదావరి తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్



ధర్మపురి వద్ద గోదావరి నదిని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

ధర్మపురి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో గోదావరి నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. శనివారం ధర్మపురి మండల కేంద్రంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్థానిక గోదావరి నది పరిసరాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ నదీ తీరాన గల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగనీయకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించి ప్రమాదకర శిథిలావస్థలో ఉన్న ఆరు గదులను వెంటనే కూల్చివేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. పట్టణంలో సైడ్ డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచి పరిశుభ్రత కోసం తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఆయన సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన వేగవంతంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత హౌసింగ్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో వన మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో రవీందర్, మండల ఇంచార్జ్ సుమన్, హౌసింగ్ పీడీ ప్రసాద్, మున్సిపల్ డీఈఈ వరుణ్, హౌసింగ్, మున్సిపల్, ఆర్అండ్‌బీ ఏఈఈలు భవాని, అశ్రుత్, ధర్మరాజు, భరద్వాజ్, మున్సిపల్ మేనేజర్ బాలె గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్యాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

'రావూరి' సాహిత్య ప్రక్రియలు వినూత్నం



మాట్లాడుతున్న ఎర్రోజు వేంకటేశ్వర్లు

కరీంనగర్ కల్చరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రచనా ప్రపంచంలో రావూరి భరద్వాజ చేసిన సాహిత్య ప్రక్రియలు వినూత్నమని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎర్రోజు వేంకటేశ్వర్లు అన్నారు. రావూరి జయంతి సందర్భంగా శనివారం ఫిలింభవన్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రావూరి యాది సమావేశంలో ఆయన ప్రధాన ప్రసంగం చేశారు. రావూరిపై చలం ప్రభావం ఉండేదని అన్నారు. ఆయన జ్ఞానపీఠ్ అందుకున్న 3వ తెలుగు సాహిత్య దిగ్గజమని పేర్కొన్నారు.

● సమాజాన్ని చదివిన గొప్ప కవి 'రావూరి' : డాక్టర్ రవిచంద్ర

సమాజాన్ని చదివిన గొప్ప కవి రావూరి భరద్వాజ అని కఫిసొ అధ్యక్షుడు, ఫిలిం క్రిటిక్ డాక్టర్ పొన్నం రవిచంద్ర అన్నారు. ఆయన మాట్లాడుతూ 8వ తరగతిలోనే చదువు ఆపివేసినా గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి గొప్ప రచయితగా ఎదగడం అసాధారణ విషయమని అన్నారు. అనంతరం మామిడి హరికృష్ణ దర్శకత్వంలో పొన్నం రవిచంద్ర, ఐనంపూడి శ్రీలక్ష్మి రావూరి జీవితంపై నిర్మించిన 'ఏకాంతవాసి' లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కఫిసొ కార్యదర్శి లక్ష్మీగౌతమ్, సయ్యద్ ముజాఫర్, అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం, కందుకూరి అంజయ్య, అనిల్‌కుమార్ అశోక్ రావు, సురేశ్, దామరకుంట శంకరయ్య, తోట నిర్మలారాణి, పిఎస్ రవీంద్ర, అన్నాడి గజేందర్‌రెడ్డి, ప్రభాకర్, జితేందర్ పాల్గొన్నారు.

బీసీ యోధులపై నిర్లక్ష్యం సరికాదు

● కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్

గణేశ్‌నగర్,జూలై 5 (ఆంధ్రజ్యోతి): బీసీ యోధుల జయంతి, వర్ధంతి సమయంలో జిల్లా అధికారులు ఆ మహనీయులను స్మరించుకోవడంలో వివక్షకు గురిచేయడం సరికాదని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. దొడ్డి కొమరయ్య వర్ధంతి కార్యక్రమంలో వారిని స్మరించుకోవడంలో జిల్లా అధికారులు వివక్షకు గురిచేయడం తగదని, అలా చేసిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. బీసీ వర్గాల కోసం. బడుగు బలహీన వర్గాల కోసం పనిచేసిన ఎంతో మంది మహనీయుల చరిత్రను భావి ప్రపంచానికి తెలియాలన్నా వారికి సరైన గుర్తింపును ఇచ్చి వారిసేవలను స్మరించుకోవాలన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో జరిగిన దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా జిల్లా అధికారులు అగ్రవర్ణాలలో ఉన్న నాయకులకు ఒకతీరుగా బడుగు బలహీన వర్గాల మహనీయులకు ఒక విధంగా వారి వర్గాలను బట్టి ప్రాధాన్యతనిస్తూ వారిని స్మరించుకోవడంలో కూడా వర్గవివక్ష చూపించారన్నారు. అలా బీసీ యోధుల పట్ల వివక్షతను ప్రదర్శించిన కరీంనగర్ జిల్లా అధికారులపైన ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమరయ్యకు నివాళులు అర్పించేందుకు వెళ్లిన బీసీ నాయకులకు కుల సంఘాల ప్రతినిధులకు జిల్లా అధికారులు కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా ఏర్పాటు చేయకుండా అవమానించారని ఆరోపించారు. ఆరు బయటనే తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమరయ్య చిత్రపటం పెట్టి అక్కడే పూలు వేయించిన తీరును బీసీ కుల సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. గతంలో కూడా బీసీ మహనీయుల జయంతి, వర్ధంతిల సందర్భంగా బీసీలకు ఎవరికీ సమాచారం ఇవ్వకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిన సందర్భాలు ఉన్నాయన్నారు. దొడ్డి కొమరయ్య వర్ధంతిలో కూడా ఇలాంటి వివక్షనే అధికారులు ప్రదర్శించారన్నారు. బీసీ సమాజమంతా ఏకమై బిసి కుల సంఘాల అధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీసీ సంఘాలకు సరైన న్యాయం జరిగేలా చూడాలన్నారు.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ల ప్రారంభం


గణేశ్‌నగర్,జూలై 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు ఆగష్టు నెల 13 వరకు గడువు ఉందని ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వరలక్ష్మి, కోఆర్డినేటర్ డా.మనోజ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్, ఐఐటి, డిప్లొమా విద్యార్థులు, టీఎస్ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసి రశీదు పొందాలని పేర్కొన్నారు. ఇతర సమాచారం కోసం ఫోన్ : 7382929755 నెంబర్‌కి కాల్ చేసి సంప్రదించాలని తెలిపారు.

కొండగట్టు అంజన్నకు ఆషాఢం ఎఫెక్ట్

మల్యాల, జూలై 5(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆషాఢం ఎఫెక్ట్ కనిపించింది. ప్రతి శనివారం భక్తులతో రద్దీగా ఉండే స్వామి వారి సన్నిధానం ఈ శనివారం భక్తుల అంతంత మాత్రమే రాకతో బోసిపోతోంది. వేలాదిగా వచ్చే భక్తుల స్థానంలో వందలాదిగా మాత్రమే స్వామి వారిని దర్శించుకుంటున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తుల రాక తగ్గడంలో ఆలయంలోని క్యూలైన్‌లు, ఆలయ పరిసరాలు బోసిపోయాయి.

● భక్తుడికి సెల్‌ఫోన్ అప్పగింత

అంజన్న దర్శనం చేసుకున్న నిజామాబాద్‌కు చెందిన ఓ భక్తుడు తన సెల్‌ఫోన్ పోగోట్టుకున్నాడు. దీంతో స్థానిక పోలీస్ అవుట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్సై చిలుక శ్రీనివాస్, పోలీస్‌సిబ్బంది ఫోన్ వెతికి భక్తునికి అప్పగించారు.



భక్తులు లేక బోసిపోతున్న క్యూలైన్లు

ప్రయాణికుడికి బ్యాగు అప్పగించిన ఆర్టీసీ అధికారులు

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): జగిత్యాల నుంచి కడెంకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో బ్యాగు మర్చిపోగా జగిత్యాల డీఎం కల్పన, కండక్టర్ అశోక్ ప్రయాణికుడికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే. కడెం నుంచి జగిత్యాల వస్తున్న బస్‌లో శనివారం బుట్టాపూర్ సమీపంలో దుర్గం స్వామి, లక్ష్మీ అనే ప్రయాణీకులు జగిత్యాల ఆసుపత్రికి వెళ్లేందుకు బస్సు ఎక్కారు. జగిత్యాల బస్టాండ్ రాగానే సదరు ప్రయాణికులు బ్యాగు మర్చిపోయి బస్ దిగి వెళ్లారు. గుర్తించిన వారు డీఎంకు ఫోన్ చేసి వివరించగా డీఎం కల్పన ఆదేశాలతో బస్ కండక్టర్ అశోక్ చేతులమీదుగా బాధితులకు బ్యాగుతో పాటు, బ్యాగులో ఉన్న రూ.30వేల నగదు అందజేశారు.

ఉపాధి పనుల్లో పొదుపు మంత్రం

(5వ పేజీ తరువాయి)

లక్షలకు పైగా పని దినాలను పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం పని దినాలను తగ్గించడం వల్ల ఉపాధి కూలీలకు పనులు కల్పించే పరిస్థితి లేకుండా పోతున్నది. ప్రస్తుతం ఉన్న 3 లక్షల 85 వేల పని దినాలు ఈ నెలలో చేపట్టనున్న వన మహోత్సవం మొక్కలు నాటే కార్యక్రమానికే సద్వినియోగం చేసుకోనున్నారు. మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వడంతో పాటు వాటి సంరక్షణకు నీళ్లు పోయడం, ఆ మొక్కల చుట్టూ గడ్డి, ఇతర కలుపు మొక్కలను తొలగించాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం మున్నెన్నడూ లేని విధంగా ఉపాధి పని దినాలను 40 శాతానికి పైగా తగ్గించడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. కూలీలకే కల్పించే పని దినాల వల్ల గ్రామాల్లో కూడా శాశ్వత నిర్మాణ పనులకు నిధుల కొరత ఉండేది కాదు. కానీ పని దినాలు తగ్గించడం అటు.. రాష్ట్ర ప్రభుత్వానికి, ఇటు.. కూలీలకు శరాఘాతంగా మారింది.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

పెద్దపల్లి రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెద్దకల్వల నోబెల్ హైస్కూల్‌లో పదో తరగతి పూర్తి చేసుకున్న పల్లెర్ల అంజలికి బాసరా ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. శనివారం పాఠశాలలో తల్లిదండ్రులతో పాటు విద్యార్థిని అంజలిని కరస్పాండెంట్ మోహన్ రాజా శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ ప్రణీత, ఉపాధ్యాయులు రమేష్, వెంకట్, షబానా, సంపత్‌లు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామపరిధిలోగల మోడల్ స్కూల్ విద్యార్థులు బాసరలోని ఐఐఐటీకి ఎంపికయినట్లు ప్రిన్సిపాల్ అనుముల పోచయ్య తెలిపారు. ఎంపికైన విద్యార్థులు సహస్రవర్షిని, వేదప్రియ, దాశరథిలను ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): జూలపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థులు బాసర, మహబూబ్‌నగర్‌లోని ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందారు. విద్యార్థులు వైద్య శ్రీవరుణ్, పెనగొండ హార్థిక్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన చామనపల్లి గ్రామానికి చెందిన ఆవుల నవ్య, దొంగతుర్తి ఉన్నత పాఠశాలలో వెన్నం ప్రియాంక, ఆదర్శ పాఠశాలకు చెందిన సిద్ధార్థ్, రమ్యశ్రీకి సీట్లు సాధించారు. విద్యార్థులను ఎంఈఓ ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు మాలతీ లత, వేణుగోపాల్‌రెడ్డి, ఈరవేణి రాజ్‌కుమార్ అభినందించారు.

ఖనిలో గోరింటాకు సందడి



కళ్యాణ్‌నగర్, జూలై 5 (ఆంధ్ర జ్యోతి): ఆషాఢమాసం సందర్భంగా శనివారం 33వ డివిజన్‌లో మహిళలు గోరింటాకు మహోత్సవాన్ని నిర్వహించారు. సౌజన్య లత మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మహిళలపై ఉందన్నారు. గోరింటాకులో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయన్నారు.

ఘనంగా బోనాలు



కళ్యాణ్‌నగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బోనాలను నిర్వహించారు. ఇందిరానగర్, రాంనగర్, మార్కండేయకాలనీ, విఠల్‌నగర్ ఏరియాల నుంచి మహిళలు బోనాలతో చౌరస్తాకు చేరుకున్నారు. జానపద గాయని కన కవ్వ పాటలు ఆకట్టుకున్నాయి. పెద్దమ్మ ఆలయానికి చేరుకుని బోనాలను సమర్పించారు.

విద్యార్థులను అన్ని రంగాలలో ప్రోత్సహించాలి

సుల్తానాబాద్, జూలై 5: (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు అన్ని రంగాలలో రాణించే విధంగా వారికి తగిన తర్ఫీదు ఇవ్వాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని అల్ఫోర్స్ హైస్కూల్‌లో శనివారం పలు గ్రూపులుగా విభజించి వారికి హౌస్ ఎలక్షన్స్ నిర్వహించి ఎన్నికల విధానం గురించి అవగాహన కల్పించారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతు విద్యార్థులకు అన్ని రంగాలలో తగిన శిక్షణ ఇస్తూ వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఎన్నికల నిర్వహణ విధానం తెలుసుకోవడం ద్వారా నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు.

నేత్ర, అవయవ దానానికి సుముఖత

కళ్యాణ్‌నగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీకి చెందిన కాంపెల్లి జయ, ఆమె కుమారుడు శివ గణేష్ తమ మరణానంతరం నేత్ర, అవయవదానం చేయడానికి ముందుకు వచ్చారు. అవయవ దానం, నేత్రదానం చేయడానికి అంగీకార పత్రాలను సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తికి అందజేశారు. శనివారం పవర్‌హౌస్‌కాలనీలోని జయ నివాసంలో సదాశయ ఫౌండేషన్ డోనర్ కార్డు, అభినందన పత్రాలను అందజేశారు. లింగమూర్తి మాట్లాడుతూ మరణానంతరం తమ దేహాలను, నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చిన తల్లి, కుమారుడిని అభినందించారు.

మదర్‌థెరిస్సాలో ముగిసిన క్యాంపస్ ప్లేస్‌మెంట్



నియామక పత్రాలు అందిస్తున్న డైరెక్టర్ నవత

పెద్దపల్లి రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెద్దబొంకూర్‌లోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న ఇంజనీరింగ్, ఎంబీఏ విద్యార్థులకు శనివారం క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఫాక్స్ కాన్, రైటర్, తేజస్ నెట్వర్క్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా టెలి సర్వీస్, టీం లీస్, జెన్ టెక్నాలజీస్, ప్రీమియర్ ఎనర్జీ కళాశాలను సందర్శించి క్యాంపస్ సెలెక్షన్స్‌ను నిర్వహించారు. 200 మందికిగాను 118 మంది విద్యార్థులు ఏంపికైనట్లు కళాశాల చైర్మన్ ఎడవెల్లి నవీన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఎంపిక చేసేందుకు వచ్చిన కంపెనీలకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల డైరెక్టర్ ఏ. నవత మాట్లాడుతూ కళాశాలలో వంద శాంతం ప్లేస్‌మెంట్స్ లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాస్, అకౌంట్స్ ఆఫీసర్ పి.పవన్‌కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

కాల్వశ్రీరాంపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు అన్నారు. శనివారం కరపత్రాలను మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు నష్టం చేస్తూ యజమానులకు లాభం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అన్నారు. ఈ నెల 9న చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంబాల లక్ష్మణ్, నెల్లి కొమురయ్య, మహేష్, భాస్కర్, పాల అంజయ్య, ప్రేం కుమార్, మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఓదెల, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత కారు డ్రైవర్ ఆరెల్లి శివాజీ తండ్రి శంకరయ్య అనారోగ్యంతో మృతి చెందగా శనివారం శానగొండలో ఎమ్మెల్యే విజయరమణారావు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ ఉన్నారు.

గొల్ల కుర్మల స్థలం కోర్టుకు కేటాయింపు

పెద్దపల్లి రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాఘవపూర్ గ్రామ పంచాయతీ సర్వే నెంబర్ 1072లో గతంలో గొల్ల కుర్మలకు ప్రభుత్వం 10 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఆ స్థలాన్ని కోర్టుకు కేటాయిస్తూ జీవో జారీ చేసినట్లు తహసీల్దార్ రాజయ్య తెలిపారు. అధికారులు సర్వే చేపడుతుండటంతో గొల్ల కుర్మలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పథకాలను చిరు వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి

కోల్‌సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): చిరువ్యాపారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి అన్నారు. శనివారం వార సంతలో వ్యాపారులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. పీఎం స్వనిధి పథకం వీధి వ్యాపారులకు వరమన్నారు. మైక్రో ఫైనాన్స్‌ల వడ్డీల బారిన పడకుండా పీఎం స్వనిధి రుణం మంజూరవుతుందని అన్నారు. ప్లాస్టిక్ వాడకం నిషేధం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డులోని వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్‌పై అవగాహన కల్పించారు. అన్నపూర్ణకాలనీ ప్రభుత్వ పాఠశాల గోడలపై చిత్రీకరిస్తున్న సందేశాత్మక చిత్రాలను పరిశీలించారు. హోటళ్లు, రెస్టారెంట్‌లలో పరిశుభ్రత తీరును పరిశీలించారు. నిలువ చేసిన అనారోగ్యకర పదార్థాలను గుర్తించి జరిమానా విధించారు. నగర పాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, హెల్త్ అసిస్టెంట్ సంపత్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ , మెప్మా ఆర్‌పీలు, స్వశక్తి మహిళలు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శ

సుల్తానాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది దేశోపంతుల క్రిష్ణమూర్తి కుటుంబ సభ్యులను శనివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శించారు. క్రిష్ణమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దశదిన కర్మ కార్యక్రమాన్ని పురస్కరించుకుని వారి నివాసానికి మంత్రి వచ్చారు. క్రిష్ణమూర్తి కుమారులు ప్రభోద్ కుమార్, సతీష్ కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. మంత్రి వెంట సి.సత్యనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దన్నాయక్ దామోదరావు, ప్రేంచందర్ రావు, బిరుదు క్రిష్ణ, ఉన్నారు. ఎమ్మెల్యే విజయరమణారావు, డాక్టర్ రమేష్, సాయిరి మహేందర్, తదితరులు న్యాయవాది కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మెరుగైన వైద్యం అందించాలి

ముత్తారం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మైదంబండ రోడ్డు ప్రమాదంలో గాయపడి కరీంనగర్ మెడికేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. బాధితులను మాజీ జడ్పీటీసీ సదానందం పరామర్శించారు.

ఓపెన్ ప్లాట్లలో చెత్త ఉంటే జరిమానా



పారిశుధ్య సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

పెద్దపల్లి రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ ప్లాట్‌లలో చెత్తా చెదారం లేకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని, చెత్త వేస్తే జరిమానా విధిస్తామని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. అప్పన్నపేటలో పారిశుధ్య పనులను శనివారం పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తను సేకరించేందుకు రోజూ ట్రాక్టర్ వస్తుందని, చెత్తను సిబ్బందికి అందించాలని అన్నారు. ఇష్టానుసారంగా రోడ్లపై వేయొద్దన్నారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలత, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాలు

పెద్దపల్లి రూరల్ , జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2025-26లో అడ్మిషన్‌లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాకర్ కె.లక్ష్మీనరసయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశ నిమిత్తం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి న్యాక్‌ఏ గ్రేడ్ పొందిన సార్వత్రిక విశ్వ విద్యాలయం ద్వారా నాణ్యమైన విద్యను అందించనున్నట్లు తెలిపారు.

యువజన కాంగ్రెస్ నాయకుల ఆందోళన

ఎలిగేడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ను నమ్ముకొని అహర్నిశలు పని చేసిన కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు కరువైందని యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోట శ్రీకాంత్, నాయకులు అన్నారు. శనివారం బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ కోసం సొంత పనులను పక్కనబెట్టి కష్టపడినట్లు చెప్పారు. ఎన్నికల ముందు పార్టీలో చేరిన వారు తమను అణగదొక్కేందుకు చూస్తున్నారని ఆరోపించారు. ఈ నాయకులే గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో తమను అనేక ఇబ్బందులకు గురి చేశారని, మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేరారని అన్నారు. పార్టీలో తమకు తగిన గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు న్యాతరి సంపత్, జానీ, గంధం, విక్రమ్, ఓదెలు, నంబయ్య, వెంకటేష్, మల్లేష్ పాల్గొన్నారు.

ప్రజావేదిక గ్రామ సభలు

ఎలిగేడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 10న ఉదయం 10 గంటలకు ఉపాధిహామీ ప్రజావేదిక ఉంటుందని ఏపీవో సదానందం తెలిపారు. ఈ మేరకు ఆయా గ్రామాల వారీగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతగా శుక్రవారం బుర్హాన్‌మియాపేట, సుల్తాన్‌పూర్, నర్సాపూర్, ర్యాకల్‌దేవుపల్లి, 6న లాలపల్లి, ధూళికట్ట, 8న ముప్పిరితోట, నారాయణపల్లి, రాములపల్లి, లోకపేట, 9న ఎలిగేడు, శివపల్లిలో సభలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

పోచమ్మ ఆలయం వద్ద శ్రమదానం

సుల్తానాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోచమ్మ ఆలయం పరిసరాలను బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు శనివారం పోచమ్మ గుడి వద్ద ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయం, అనుబంధ గుడులు పూర్తి శిథిలావస్థకు చేరాయన్నారు. ఆలయానికి సంబంధించిన భూమి ఆక్రమణకు గురైందని, భక్తులు సామూహిక వనభోజనాల కార్యక్రమాలను నిర్వహించుకోలేని దుస్థితి ఏర్పడిందని అన్నారు. స్థలం ఆక్రమణకు గురైనా ఎవరూ పట్టించుకోవడం లేదని, అధికారులు స్పందించి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. మహిళా మోర్చా జిల్లా నాయకురాలు వనజ, ఎల్లంకి రాజన్న, కందునూరి కుమార్, శ్రీగిరి సుధాకర్, సతీష్, సదయ్య, శేఖర్, పవన్, ఈశ్వర్, రవీందర్, వేముల శ్రీనివాస్, అరవిందరెడ్డి, మనోహర్, అనిల్, శివ ఉన్నారు.

రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి



నిట్టూరులో రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఈవో రచన

పెద్దపల్లి రూరల్/ఎలిగేడు జూలై 5 (ఆంధ్రజ్యోతి) :: మండలంలోని ఆయా గ్రామాల రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకొని గుర్తింపు కార్డులను పొందాలని మండల వ్యవసాయ అధికారి ఉమాపతి తెలిపారు. 12 గ్రామాల పరిధిలో 7848 మంది రైతులు ఉన్నారని, ఇప్పటి వరకు 4228 మంది రైతులు పేర్లను నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. మిగిలిన రైతులు ఎలిగేడు, ధూళికట్ట, సుల్తాన్‌పూర్ రైతువేదికల్లో ఏఈవోలు గణేష్, సురేష్, శరణ్య వద్ద ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ ద్వారా నమోదు చేయించుకోవాలని సూచించారు.

పాలితం రైతువేదిక పరిధిలోని గ్రామాల రైతులు రైతు గుర్తింపు కార్డు కోసం నమోదు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఈవో రచన అన్నారు. శనివారం నిట్టూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో రిజిస్టేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నమోదు చేసుకోని రైతులు ఉంటే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎప్‌సెట్ సర్టిఫికెట్ల పరిశీలన

కోల్‌సిటీటౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని శాతవాహన యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎప్‌సెట్-2025 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతున్నది. శనివారం సుమారు 180 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమాకాంత్, పాలిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈనెల 6వ తేదీ నుంచి 11వ వరకు వారికి కేటాయించిన లాగిన్ ద్వారా ఆప్షన్లు ఇవ్వాలని సూచించారు. అధికారులు డాక్టర్ రవి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ రమేష్‌రెడ్డి, అజయ్‌కుమార్, యాదయ్య పాల్గొన్నారు.

నేడు ఏకలవ్య జయంత్యుత్సవాలు

కళ్యాణ్‌నగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రామగుండం నియోజకవర్గ అధ్యక్షుడు మానుపాటి స్వామి, ప్రధాన కార్యదర్శి సార్ల తిరుపతి పిలుపునిచ్చారు. శనివారం గోదావరిఖని చౌరస్తాలో ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ఎరుకల కులస్థులు ఆదివారం తొలి ఏకాదశి రోజు ఉత్సవాలు నిర్వహించాలని, గురుశిష్యుల బంధాన్ని ప్రపంచానికి చాటిన వ్యక్తి ఏకలవ్యుడని కొనియాడారు. రాష్ట్రంలో 6లక్షల మంది ఎరుకల కులస్థులు ఉన్నారని, ప్రభుత్వమే అధికారికంగా జయంత్యుత్సవాలను నిర్వహించాలని, విగ్రహాలను నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. మానుపాటి శ్రీనివాస్, తిరుపతి, కుమారస్వామి, పోచయ్య పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పాలకుర్తి, జూలై 5(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని బసంత్‌నగర్ ఎస్సై స్వామి అన్నారు. శనివారం బసంత్‌నగర్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణపై యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుట్కా,గంజాయి, మాదకద్రవ్యాలు, సిగరేట్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, వీటి వాడకంతో ఆరోగ్యం దెబ్బతింటుందని, ఆలోచన శక్తి నశిస్తుందని అన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం, క్రమశిక్షణ కీలకమని పేర్కొన్నారు



పార్కు స్థలంలో మొక్కలు నాటిన డైరెక్టర్



మొక్కలు నాటుతున్న డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు

గోదావరిఖని, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి పవర్‌హౌస్ సమీపంలోని దుర్గామాత అమ్మవారి ఆలయ సమీపంలో శనివారం సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ ఎం) డీ సత్యనారాయణ రావు మొక్కలు నాటారు. రూ.5లక్షల వ్యయంతో సింగరేణి ఇక్కడ పార్కు నిర్మాణం చేస్తుంది. డైరెక్టర్ మాట్లాడుతూ నెలరోజుల్లోపు పార్కు నిర్మాణం పూర్తి కావాలని, ఫలాలు, పుష్పాల మొక్కలను నాటాలని సూచించారు. ఈ పార్కు అభివృద్ధి వలన ఆలయానికి వచ్చే భక్తులతో పాటు కార్మిక కుటుంబాలు, పాదచారులకు కూడా ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఇన్‌చార్జి ఎస్ఓటూజీఎం అంజనేయప్రసాద్, డీజీఎం (ఫారెస్ట్) కరుణ, సైంటిఫిక్ ఆఫీసర్ హరిసింగ్, అధికారులు వసంత్‌కుమార్, వీరారెడ్డి, టెంపుల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ సిలబస్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న జయశ్రీనాయక్

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 సింగరేణి స్కూల్‌లో సీబీఎస్ఈ సిలబస్ అమలులో భాగంగా శనివారం ఉపాధ్యాయులకు ఎస్‌సీఓఏ క్లబ్‌లో శిక్షణా కార్యక్రమం జరిగింది. సీబీఎస్ఈ ప్రాముఖ్యత, సిలబస్ ప్యాటర్న్, విద్యా ప్రణాళిక, వార్షిక ప్రణాళిక, కరిక్యులమ్ ఎక్స్‌ట్రా కరిక్యులమ్, మెథడాలజీ, స్టూడెంట్ సెంట్రిక్ పద్ధతులపై ఉపాధ్యాయ బృందానికి నిపుణులైన డా. జయశ్రీ నాయక్, అనుపమదేవిలు అవగాహన కల్పించారు. విద్యార్థుల సమగ్ర ఎదుగుదల, నాణ్యమైన విద్యను అందించేందుకు యాజమాన్యం కట్టుబడి ఉన్నట్టు కరస్పాండెంట్ అరవిందరావు తెలిపారు. హెచ్ఎం సుందర్‌రావుతో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మహిళా రెస్క్యూ జట్టు ఉత్తమ సేవలందించాలి



సింగరేణి రెస్క్యూ మహిళా జట్టుతో సీఎండీ బలరాంనాయక్

గోదావరిఖని, జూలై 5(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మహిళా రెస్క్యూ జట్టు తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకోవాలని, అకింత భావంతో ఉత్తమ సేవలు అందించాలని సీఎండీ బలరాంనాయక్ పిలుపునిచ్చారు. తొలి సారిగా రెస్క్యూలో శిక్షణ పొందిన మహిళా జట్టును సింగరేణి భవన్‌లో అభినందించారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. సింగరేణిలో మొదటి మహిళా రెస్క్యూ జట్టు ఏర్పాటు చేయడం, శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో జరిగే జాతీయ, అంతర్జాతీయ స్థాయి రెస్క్యూ పోటీల్లో పాల్గొని సింగరేణికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. సింగరేణి రెస్క్యూ బృందాలు ఇటీవల శ్రీశైలం ప్రమాద సమయంలో, హైదరాబాద్ పాశమైలారం అగ్ని ప్రమాద దుర్ఘటన, తమిళనాడులో జరిగిన ప్రమాదాల్లో సేవలు అందించి ప్రశంసలు అందుకొందన్నారు. రాష్ట్ర, కేంద్ర విపత్తుల ప్రతిస్పందన బృందాలకు సింగరేణి రెస్క్యూ స్టేషన్‌లో శిక్షణ ఇస్తున్నట్టు ఆయన వెల్లడించారు. రామగుండం -2 ఏరియాలో ఉన్న మైన్స్ రెస్క్యూ స్టేషన్‌ను ప్రపంచ స్థాయి శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్టు వెల్లడించారు. జీఎం(రెస్క్యూ) శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, గౌతం పొట్రు, అధికారులు సుభాని, శ్రీనివాస్, శిక్షకులు తిరుపతి, కిషన్‌రావు, సందీప్, సాజిద్ అలీ పాల్గొన్నారు.

1.8లక్షల టన్నుల ఉత్పత్తి సాధించాలి

సింగరేణి సంస్థ జూలైలో ఉత్పత్తి, రవాణాలపై ప్రత్యేక దృష్టి సారించింది. శనివారం సింగరేణి భవన్ నుంచి సంస్థ డైరెక్టర్లు, ఏరియాల జీఎంలతో త్రైమాసిక ప్రగతిపై సీఎండీ బలరాం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో వంద శాతం బొగ్గు రవాణా సాధించినందుకు సీఎండీ సంతృప్తి వ్యక్తం చేశారు. జూలైలో రోజు 1.8లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే 2.15లక్షల టన్నుల బొగ్గును రోజూ రవాణా చేసే విధంగా సిద్ధం కావాలన్నారు. కొత్తగూడెం వీకే ఓపెన్‌కాస్టుకు భూమిపూజ చేస్తామని ఆయన చెప్పారు. వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకుంటూ ఓపెన్ కాస్టు గనుల నుంచి నిరాటకంగా బొగ్గు ఉత్పత్తి జరిగేలా క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన జీఎంలకు సూచనచేశారు. నైనీ బొగ్గు బ్లాకులో ప్రారంభమైన బొగ్గు ఉత్పత్తిపై కూడా ఆయన సమీక్షించారు. డైరెక్టర్లు సత్యనారాయణరావు, సూర్యనారాయణ, అధికారులు సుబాని, మోహన్ పరిగెన్, మనోహర్‌తో పాటు అన్నీ ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

క్యాడర్ స్కీం అమలు చేయండి

గోదావరిఖని, జూలై 5(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేస్తున్న పారామెడికల్ సిబ్బందికి క్యాడర్ స్కీం అమలు చేయాలని శనివారం అధికారులకు ఏరియా హాస్పిటల్ సిబ్బంది మెమోరాండం సమర్పించారు. సింగరేణిలో పని చేస్తున్న పారామెడికల్ సిబ్బంది, వార్డు అసిస్టెంట్లకు గ్రేడ్ హెచ్ ఇవ్వడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని, కోల్ ఇండియాలో అదే డిజిగ్నేషన్‌కు ఈ గ్రేడ్ ఇస్తున్నారని అసిస్టెంట్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లారు. సింగరేణిలో ఈ గ్రేడ్‌కు చేరుకోవడానికి 20 సంవత్సరాలు పడుతున్నదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి క్యాడర్ స్కీం కోల్ ఇండియా మాదిరిగా అమలు చేయాలని కోరారు. ఏరియా హాస్పిటల్ సిబ్బంది దాసరి అనీల్, సంతోష్, భాస్కర్ పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

రామగిరి, జూలై 5(ఆంధ్రజ్యోతి): సింగరేణి సిఎస్ఆర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొవాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు యువతకు పిలుపు నిచ్చారు. శనివారం విటిసి కార్యాలయంలో స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో సిఎస్ఆర్ ఆధ్వర్యంలో 30 మంది యువతకు రెండు వారాల పాటు నిర్వహించిన ఉచిత సోలార్ టెక్నీషియన్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. జీఎం మాట్లాడుతూ శిక్షణ ద్వార పొంది సాంకేతికత ద్వార ఆర్థికంగా ఎదుగాలని ఆకాంక్షించారు. ఏపిఏ జీఎం నాగేశ్వర్‌రావు, అధికారులు రామ్మోహన్, సుజీత్, శ్రీనివాస్, శిక్షకులు అశోక్ పాల్గొన్నారు.

క్వార్టర్లకు మరమ్మతు చేపట్టాలి

రామగిరి, జూలై 5(ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీలో శిథిలావస్థకు చేరిన టీటూ క్వార్టర్స్‌కు మరమ్మతు చేపట్టాలని పన్నూరు మాజీ ఎంపీటీసీ చిందం మహేష్ శనివారం ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. దశాబ్దల కాలం క్రితం నిర్మాణం చేపట్టిన టిటూ క్వార్టర్స్ రూఫ్ పెచ్చులు ఊడిపోయి కిందపడుతున్నాయని, రూఫ్ లీకేజీ సమస్య కార్మిక కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తోందని పేర్కొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

రామగిరి, జూలై 5(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపిఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పిలో అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం నేషనల్ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ ఆవిష్కరించారు. ఆర్జీ-3, ఏపిఏ జీఎంలు సుధాకర్‌రావు, కొలిపాక నాగేశ్వర్‌రావు, అధికారులు జనార్ధన్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం సెక్రటరీ అంతోటి నాగేశ్వర్‌రావు, నాయకులు మహంకాళి శంకర్, దయాల్‌శర్మ, బత్తుల శంకర్, ఉదయ్‌కుమార్, బండి భాస్కర్, విజయ్, పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ఉప సంహరించుకోవాలి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

గోదావరిఖని, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. శనివారం జీడీకే 1ఇంక్లైన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో వివిధ కార్మిక సంఘాల నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, సదానందం, మెండె శ్రీనివాస్, వడ్డేపల్లి శంకర్, కట్ల విశ్వనాథ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లుగా విభజించిందని, పాత చట్టాలను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. నాలుగు కోడ్‌లు కార్మిక చట్టాలను, కార్మిక సంఘాలను ప్రభుత్వరంగంలో లేకుండా చేసే విధంగా ఉన్నాయన్నారు. అంశాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా అన్నీ కార్మిక సంఘాలు ఈనెల 9న చేపట్టిన సమ్మెలో సింగరేణి కార్మికవర్గమంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం, మాదాసు రామమూర్తి, సంకె అశోక్, మానాల శ్రీనివాస్, సిర్ర మల్లికార్జున్ పాల్గొన్నారు.

కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా కార్మిక చట్టాలను రూపొందిస్తున్నదని, ఇందుకు నిరసనగా 9న జరిగే సమ్మెలో సింగరేణి కార్మికవర్గం పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. జీడీకే 11ఇంక్లైన్‌పై ఐక్య వేదిక ఆధ్వర్యంలో సమ్మెపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ నరేష్, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతంగి రాయమల్లు, టీఎస్‌యూఎస్ నాయకులు పోగుల శేఖర్ మాట్లాడారు. జీ రాములు, రాజేశం, ఎస్ ప్రసాద్, శేఖర్, రామస్వామి పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. శనివారం ఆర్జీ-2 వర్క్‌షాప్‌లో జరిగిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. కేంద్రం తీసుకున్న కార్మిక చట్టాల సవరణను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా అన్ని యూనియన్లు ఈనెల 9న సమ్మె చేయడానికి నిర్ణయించినట్టు తెలిపారు. ప్రకాష్, జీ రవీందర్, సాంబ శివరావు, కుంట ప్రవీణ్, ఎస్ వెంకన్న, ప్రభాకర్‌రెడ్డి, శశాంక్ పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

రామగిరి, (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మె విజయవంతానికి కాంట్రాక్టు కార్మికులు సహకరించాలని జేఏసీ కన్వీనర్ కోటరవీందర్‌రెడ్డి కోరారు. శనివారం ఓసిపి-2లో కాంట్రాక్టు కార్మికులతో ట్రేడ్‌యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు అడ్డుకట్ట వేయాలని పిలుపు నిచ్చారు. వైవిరావు, సాంబయ్య, కుమార్, సత్రం సమ్మయ్య, రామిండ్ల మనోహర్, బుద్దే సదానందం, కోలా అనిల్, అడ్డూరి రాజయ్య, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.